

# గొల్లకురుమలకు జవ జీవాలు

- సబ్సిడీపై గొర్రెల యూనిట్లు పంపిణీ
- రెండో విడుత పంపిణీ ప్రారంభం
- జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా 8,833 యూనిట్ల అందజేతకు కసరత్తు

గద్వాల, అక్టోబర్ 2 : కులవృత్తులకు తెలంగాణ ప్రభుత్వం జీవం పోస్తూ ఆర్థిక చేయూతనిస్తున్నది. గత పాలకుల హయాంలో కులవృత్తులకు గుర్తింపు లేక ఎంతోమంది ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న క్రమంలో కులవృత్తులకు పునర్జీవం పోస్తూ ఆర్థికంగా లబ్ధి చేకూరేలా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. అందులో భాగంగా మత్స్యకారులకు ఉపాధి కల్పించేందుకు చెరువుల్లో ఉచితంగా చేపలు చేపపిల్లలు వదలడం, వలలు ఇవ్వడం, చేపలు విక్రయించేందుకు వాహనాలను సైతం ప్రభుత్వం సమకూర్చింది. దళితులు ఆర్థికంగా ఎదిగేందుకు దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టి లబ్ధిదారులకు రూ.10లక్షలు అందజేస్తున్నది. అదేవిధంగా బీసీ, మైనార్టీ బంధు ప్రవేశపెట్టి లబ్ధిదారులకు ఎలాంటి పూచీకత్తు లేకుండా కులవృత్తిలో రాణించడానికి ఒక్కొక్కరికి రూ.లక్ష అందజేసింది. ఇలా కులవృత్తులకు ప్రభుత్వం అండగా ఉండి వారు ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నది. ఈక్రమంలోనే గొల్లకురుమలు సైతం సగర్వంగా బతికేందుకు సబ్సిడీపై గొర్రెలను పంపిణీ చేస్తూ అంతరించిపోతున్న కులవృత్తులకు సీఎం కేసీఆర్ జీవం పోశారు. గొర్రెల పంపిణీతో గొర్రెలకాపర్ల ఇండ్లు మందలతో కళకళలాడుతున్నాయి. అంతరించిపోతున్న వృత్తులు బీఆర్ఎస్ సర్కారు అందిస్తున్న పథకాలతో జీవం పోసుకున్నాయి. గొర్రెలు అందించడంతో జోగుళాంబ గద్వాల జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు వలసలు తగ్గిపోయాయి. మొదటి విడతలో జిల్లాలో 10,024 యూనిట్లను పశుసంవర్ధకశాఖ అధికారులు విజయవంతంగా పంపిణీ చేసి రెండో విడతకు సంసిద్ధమయ్యారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా 8,833 మందికి గొర్రెలను పంపిణీ చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే 540 యూనిట్లను పంపిణీ చేశారు. కాగా ఎలమంద పుణ్యమా అని గొల్లకురుమల జీవితం పూర్తిగా మారిపోయింది. జీవనోపాధి లేక రాయలసీమ, హైదరాబాద్, కర్ణాటక రాష్ట్రానికి వలస పోయే గొర్రెలకాపర్లు ఇప్పుడు సొంత ఊళ్లోనే ఆర్థిక సంపదను సృష్టించుకుంటున్నారు. సబ్సిడీ గొర్రెల పంపిణీకి ప్రభుత్వం 2017 జూన్ 20న శ్రీకారం చుట్టింది. 18 ఏండ్లు దాటినా ఈ పథకం దిగ్విజయంగా కొనసాగుతున్నది. జిల్లాలో 182 సొసైటీలు ఉండగా వీటి ద్వారా జిల్లాలో సుమారు 55వేల కుటుంబాలకు లబ్ధి చేకూరనున్నది.

### గతంలో పారదర్శకంగా..

గ్రామీణ ప్రాంతాల్లో పేదరికాన్ని శాశ్వతంగా పారదోలాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గొర్రెలకాపర్లకు ప్రత్యేక పథకాలను రూపొందించింది. సొసైటీల ద్వారా మొదటి విడతలో 10,024మందిని గుర్తించి గొర్రెల యూనిట్లు పంపిణీ చేశారు. గతంలో ఒక్కో యూనిట్‌కు ప్రభుత్వం రూ.లక్షా 25వేలు ఖర్చు అవుతుండగా అందులో 75శాతం ప్రభుత్వమే భరించేది. ప్రస్తుతం యూనిట్ ధరను సర్కారు రూ.1.75లక్షలకు పెంచింది. దీంతో గతంలో లబ్ధిదారుడు రూ.31,250 తన వాటాగా చెల్లించగా ఇప్పుడు రూ.43,750 చెల్లించాల్సి ఉంటుంది. గతంలో ప్రభుత్వం రూ.93,750 చెల్లించగా నేడు రూ.1,31,250 ఇవ్వనున్నది. ఒక యూనిట్‌లో 20గొర్రెలు, ఒక పొట్టేలును అందిస్తున్నారు. పశుసంవర్ధక శాఖ అధికారులు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ నుంచి గొర్రెలను కొనుగోలు చేసి లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు.



### పేదోళ్లకు ఎంతో మేలు..

కురుమలకు గొర్రెలు పంపిణీతో ఎంతోమంది పేదోళ్లలు ఆర్థికంగా మేలు కలుగుతున్నది. మా ఇంట్లో ఆరుగురికి గొర్లు అందాయి. ఈ గొర్లను మేమే స్వయంగా మేపుకొంటున్నాం. గతంలో వ్యవసాయం కూలీలుగా పనిచేసే వాళ్లం. ఆ పని వదిలి ఎలమందతో ఇప్పుడిప్పుడే ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాం.

- యాదవ గోవర్ధన్, ఎర్సన్‌దొడ్డి

6

### కులవృత్తులకు సర్కారు చేయూత



- దౌలన్న, దౌదర్‌పల్లి

మా ఇంట్లో నాతోపాటు నాభార్యకు కూడా సర్కారు గొర్లను అందించింది. ఇంతకు ముందు నేను హమాలీగా పనిచేసేవాణ్ణి. నా భార్య వ్యవసాయ కూలి పనులకు వెళ్లేది. ప్రభుత్వం గొర్రెలు పంపిణీ చేయడంతో హమాలీ పని వదిలి వాటిని పెంచుతున్నాం. ఇది మాకు మంచి సంపాదన. కేసీఆర్ సార్ తీసుకొచ్చిన ఈ పథకంతో మేము ఆర్థికంగా లాభం పొందే అవకాశం లభించింది. గొర్రెల సంఖ్య పెంచుకుంటూ ఆదాయాన్ని పొందడం సంతోషంగా ఉంది. తెలంగాణ ప్రభుత్వమే కులవృత్తులకు చేయూతనిచ్చింది. దీంతో మాలాంటి వారికి ఎంతో మేలు జరుగుతున్నది. మాకోసం ఇంత చేస్తున్న సీఎం కేసీఆర్ సార్‌కు గొల్లకురుమల తరపున ఎప్పటికీ రుణపడి ఉంటాం.

# పెరిగిన పచ్చదనం

- సీఎం కేసీఆర్ పాలనలో అద్భుత ప్రగతి
- పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- కేసీఆర్ ఎకో అర్బన్ పార్కును ప్లాస్టిక్ ఫ్రీగా తీర్చిదిద్దుతా.. : ఎంపీ జోగినపల్లి సంతోశ్

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, అక్టోబర్ 2 : కేసీఆర్ ఎకో అర్బన్ పార్కును ప్రపంచంలోనే అత్యుత్తమమైనదిగా తీర్చిదిద్దేందుకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆహర్నిశలు కృషి చేస్తున్నారని, అందుకు పూర్తి సహకారం అందిస్తామని ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ అన్నారు. మహబూబ్‌నగర్‌లోని కేసీఆర్ ఎకో అర్బన్ పార్కులో రూ.2.70కోట్లతో నిర్మించనున్న బర్డ్స్ ఎన్‌క్లోజర్‌ను ఎంపీ, మంత్రితో కలిసి సోమవారం ప్రారంభించారు. అనంతరం 26వేల ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద జంగల్ సఫారీతోపాటు రెండు సఫారీ వాహనాలను జెండా ఊపి ప్రారంభించి ఆ వాహనంలోనే వాచ్‌టవర్ వరకు వెళ్లి అటవీ ప్రాంతాన్ని తిలకించారు. అనంతరం అక్కడ నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ ద్వారా పచ్చదనాన్ని పెంచి పర్యావరణాన్ని కాపాడుతున్న ప్రకృతి ప్రేమికుడు ఎంపీ సంతోష్ చేతుల మీదుగా జంగల్ సఫారీని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. పదేండ్ల సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ అద్భుత ప్రగతి సాధించిందన్నారు. తాగు, సాగునీరు, మెడికల్, ఇంజినీరింగ్ కళాశాలలు, ఐటీ టవర్ ఇలా ఎన్నో ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. వందేండ్ల పాలనలో ఆకలి చావులు, బాధలు, కనీసం తాగడానికి మంచీనీరు కూడా లేక ఎన్నో అవస్థలు పడ్డామన్నారు. వంద ఏండ్లుగా ఉన్న ఈ పార్కు అభివృద్ధికి ఒక్కరూ ముందుకు రాలేదన్నారు. భవిష్యత్‌లో పెద్ద ఎత్తున పర్యాటకులు వచ్చేలా జంగల్ సఫారీని తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం ఎంపీ సంతోష్ మాట్లాడుతూ 1.5 ఎకరాల్లో వేలాది పక్షులతో బర్డ్స్ ఎన్‌క్లోజర్‌ను ప్రారంభించడం సంతోషకరమన్నారు. పక్షుల ప్రేమికుడైన తనను ఈ కార్యక్రమానికి ఆహ్వానించడంపై హర్షం వ్యక్తం చేశారు. దీన్ని ప్లాస్టిక్ ఫ్రీ పార్కుగా తీర్చిదిద్దుదామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ రవినాయక్, ఎస్పీ నరసింహ, డీఎఫ్‌వో సత్యనారాయణ, గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రెహమాన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బర్డ్స్ ఎన్‌క్లోజర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ సంతోష్‌కుమార్



సఫారీ టూర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి, ఎంపీ



ఎకో అర్బన్ పార్కులో సందడి చేస్తున్న విద్యార్థులు

# జడ్చర్లను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి
- రూ.3 కోట్ల నిధులతో మున్సిపల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

జడ్చర్ల టౌన్, అక్టోబర్ 2 : జడ్చర్ల మున్సిపాలిటీని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. రూ.3 కోట్ల నిధులతో ప్రస్తుత పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రహదారులతోపాటు అంతర్గత రహదారులన్నీ మెరుగు పడ్డాయన్నారు. అలాగే పార్కులు, మినీ ట్యాంకుబండ్‌లు నిర్మించినట్లు తెలిపారు. రూ.కోట్లాది నిధులతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టినట్లు చెప్పారు. మున్సిపల్ కార్యాలయ భవనం పనులను త్వరగా.. నాణ్యతగా చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. త్వరలోనే తాసీల్దార్, భూసార పరీక్ష కేంద్రాల కార్యాలయ భవనాలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన నిధులను మంజూరు చేయించి మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు.



టైలరింగ్, మగ్గం శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

### టైలరింగ్, మగ్గం వర్క్ శిక్షణ ప్రారంభం

ఇందిరానగర్ కాలనీలో చేయూత రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టైలరింగ్, మగ్గం వర్క్ శిక్షణా శిబిరాన్ని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నైపుణ్యత పెంపొందించుకొని మరికొందరికి జీవనోపాధి కల్పించాలని కోరారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినపుడే కుటుంబాలు బాగుపడ్తాయని, ఈ క్రమంలో మహిళలందరూ స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో జెడ్పీవైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, మున్సిపల్ సిబ్బంది, ట్రస్ట్ అధ్యక్షురాలు మార్తా డేవిడ్, మహిళలు పాల్గొన్నారు.

## తండాల్లో అభివృద్ధి పరుగులు

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, అక్టోబర్ 2 : ప్రత్యేక రాష్ట్రంలో తండాలు అభివృద్ధి పరుగులు పెడుతున్నాయని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో కేటీదొడ్డి మండలం ఉమిత్యాల తండా, ధరూర్ మండలం పెద్దపాడు గ్రామానికి చెందిన 150 మంది కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు సోమవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వరాష్ట్రంలో తండాలకు మహర్దశ చేకూరిందన్నారు. తండాలను అధిక నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేయడమే సర్కారు ధ్యేయమన్నారు. గత పాలకులు గిరిజనులను కేవలం ఓటుబ్యాంకుగా వాడుకున్నారే తప్పా వారి గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. గిరిజన విద్యార్థుల కోసం కార్పొరేట్ స్థాయిలో గురుకులాలను ఏర్పాటు చేశామన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలవాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో హనుమంతు, పాండు, వర్ష, లక్ష్మణ్, లోక్యా, హరిచంద్, రత్నంనాయక్, పుణ్య, పార్వతమ్మ, పద్మమ్మ, సరోజమ్మ, గోవిందమ్మ, చంద్రమ్మ, రవి, వీర, పుష్పరాజ్, తులసమ్మ, నీలమ్మ, భీమన్న, లాజర్, నర్సింహులు, శ్రీరాములు, లాల్‌స్వామి, రాజశేఖర్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు గట్టు తిమ్మప్ప, జెడ్పీటీసీ రాజశేఖర్, సర్పంచులు విజయభాస్కర్‌రెడ్డి, సక్రునాయక్, వైస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు, నాయకులు ఉరుకుందు, చక్రధర్‌రావు, కృష్ణనాయక్, మేఘనాథ్, రాముడు, డీఆర్ విజయ్, ప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గులాబీ కండువాలు కప్పుకొని బీఆర్ఎస్‌కు జై కొడుతున్న వారితో ఎమ్మెల్యే బండ్ల



పాలమూరులోని మినీ ట్యాంక్‌బండ్ వద్ద విద్యుత్ కాంతుల్లో సస్పెన్షన్ బ్రిడ్జి



పాటలతో ఉర్రూతలూగిస్తున్న గాయకులు


# డ్రోన్.. అదిరెన్

- పాలమూరులో సస్పెన్షన్ బ్రిడ్జి ప్రారంభం
- మినీ ట్యాంక్‌బండ్‌పై సంబురంగా..
- అబ్బురపర్చిన లేజర్ లైటింగ్‌షో
- తిలకించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ జోగినపల్లి సంతోశ్
- లాహిరి.. లాహిరి.. అంటూ విహారం
- భారీగా తరలివచ్చిన ప్రజలు

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 2 : ట్యాంక్‌బండ్ వద్ద నిర్మించిన సస్పెన్షన్ బ్రిడ్జిని ఎంపీ సంతోష్‌తో కలిసి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ బోట్‌లో ప్రయాణించి ప్రారంభించారు. అనంతరం డ్రోన్, లేజర్ షోను ప్రారంభించి ప్రజలతో కలిసి వీక్షించారు. ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కేరింతలు కొడుతూ షోను ఎంజాయ్ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గతంలో ట్యాంక్ బండ్ ప్రాంతమంతా ముళ్లపొదలతో ఉండేదని, రామయ్యబౌళి ప్రాంతానికి రావాలంటే భయపడేవాళ్లమన్నారు. నేడు ఇతర రాష్ట్రాల వారు సైతం తిలకించేలా ఈ ప్రాంతాన్ని అద్భుతంగా తీర్చిదిద్దామన్నారు. విదేశీ పర్యాటకులు సైతం సందర్శించేలా 26వేల ఎకరాల్లో జంగల్ సఫారీని సిద్ధం చేసి రెండు సఫారీ వాహనాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. బర్డ్స్ ఎన్‌క్లోజర్ ద్వారా వేలాది పక్షులను ఒకేచోట తిలకించే వీలు కల్పిస్తున్నామని తెలిపారు.




పెద్ద చెరువులో బోటును ప్రారంభించి అందులో విహరిస్తున్న మంత్రి, ఎంపీ




డ్రోన్ లైటింగ్‌లో సీఎం కేసీఆర్ చిత్రం



సస్పెన్షన్ బ్రిడ్జిపై మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ సంతోష్, కలెక్టర్, ఎస్పీ



డ్రోన్ లైటింగ్‌లో మహాత్మాగాంధీ చిత్రం



డ్రోన్ లైటింగ్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చిత్రం



బర్డ్స్ ఎన్‌క్లోజర్ పార్కులో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు షేక్ హ్యాండ్ ఇచ్చేందుకు ఎగబడుతున్న విద్యార్థులు



పాలపిట్ట



డ్రోన్ షోను తిలకించడానికి వచ్చిన ప్రజలు